నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, బుధవారం 5 ఫిబ్రవరి 2025 | YADADRI BHUVANAGIRI




బీఆర్ఎస్ డైరీని ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, నాయకులు

## తుర్కపల్లిలో బీఆర్ఎస్ డైరీ ఆవిష్కరణ

తుర్కపల్లి, ఫిబ్రవరి 4 : బీఆర్ఎస్ పార్టీ 2025 డైరీని మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి మంగళవారం ఆ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అంతకు ముందు మండలంలోని మాదాపురం మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారిని ఆమె దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఇబ్రహీంపురం గ్రామంలోని లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాల నిర్వాహకులు సునీతను సన్మానించారు.

కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సింగిరెడ్డి నరసింహారెడ్డి, నాయకులు పలుగుల నవీన్, గిద్దె కర్ణాకర్, రాజేశ్, సత్యనారాయణ, శ్రీకాంత్, భాస్కర్‌నాయక్, ప్రభాకర్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

## లక్ష డప్పులు.. వేయి గొంతుల సభను విజయవంతం చేయాలి

- ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు
- పొంతనలేని సాకులతో ప్రభుత్వం ప్రదర్శనను అడ్డుకునే ప్రయత్నం
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 4 : హైదరాబాద్‌లో ఈ నెల 7న మాదిగలు నిర్వహించ తలపెట్టిన లక్ష డప్పులు.. వేయి గొంతులు బహిరంగ సభను మాదిగలంతా విజయవంతం చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య పిలుపునిచ్చారు. నార్కట్‌పల్లిలోని తన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హైదరాబాద్‌లో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నుంచి పెద్ద అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించనున్న మాదిగల ప్రదర్శనను ప్రభుత్వం అడ్డుకుంటున్నదని, అనుమతి లేదని పొంతన లేని సాకులతో ఆపాలని చూస్తున్నదని అన్నారు. ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణపై మాదిగలు 30 ఏండ్లుగా సుదీర్ఘ పోరాటం చేస్తున్నారని, ఎంతో మంది జీవితాలు త్యాగం చేశారని తెలిపారు. పోరాటాల ద్వారానే సుప్రీం కోర్టు ఏబీసీడీ వర్గీకరణకు ఆదేశించినట్లు చెప్పారు. వర్గీకరణ అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసనసభ ద్వారా వెల్లడించిన తర్వాత మాట మార్చారని, ఇప్పుడు మాల మాదిగల మధ్య పంచాయితీలు పెడుతున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి మాదిగలపై ఇకనైనా విమర్శలు మానుకోవాలని, లేకపోతే సరైన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. లక్ష డప్పులు.. వేయి గొంతుల కార్యక్రమంలో ఏమైనా ఆటంకాలు జరిగితే సీఎం రేవంత్ రెడ్డి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. మొదటి నుంచి ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలిపిందని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన వెంటనే నవంబర్ 29, 2014లో ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసిన ఘనత కేసీఆర్‌దేనని చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు అవసరమైన రాజ్యాంగ సవరణ చేయమంటే ఆనాడు కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ కుంటి సాకులు చెప్పిందని అన్నారు. నేడు ఇక్కడ అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ వర్గీకరణ విషయంలో గోడ మీది పిల్లిలా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. డప్పు ద్వారా చేస్తున్న ప్రచార ప్రదర్శనను అడ్డుకోవడం ఎవరి వల్ల కాదన్నారు. ఈ సమావేశంలో చిట్యాల మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, మాజీ కౌన్సిలర్ బొందయ్య, నాయకులు చిరుమర్తి యాదయ్య, బాషపాక రవి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



రాజాపేట : మల్లెగూడెం చెరువులో నిరసన తెలుపుతున్న రైతులు

## సాగునీటి కోసం కొనసాగుతున్న నిరసనలు


రాజాపేట, ఫిబ్రవరి 4 : కాళేశ్వరం జలాలతో గొలుసుకట్టు చెరువులు నింపి సాగు జలాలు అందించాలని కోరుతూ మండలంలో రైతు జేఏసీ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని మల్లెగూడెం చెరువులో మంగళవారం పలువురు రైతులు నిరసన చేపట్టారు. సాగు జలాలు అందించే వరకూ పోరాటం చేస్తామని మండల రైతు జేఏసీ కన్వీనర్ ఎర్రగోకుల జశ్వంత్ తెలిపారు. కార్యక్రమంలో రైతు జేఏసీ నాయకులు సట్టు తిరుమలేశ్, చింతలపూరి వెంకట్‌రాంరెడ్డి, గుంటి మధుసూదన్‌రెడ్డి, కాకల్ల ఉపేందర్, కుమ్మరి లక్ష్మణ్, రాములునాయక్, గొడుగు రాజు, మేక వెంకటేశ్వర్‌రెడ్డి, రాజు, లక్ష్మణ్‌నాయక్, రవీందర్ రెడ్డి, పుల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

## రెండో రోజు నామినేషన్లు నిల్

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి4(నమస్తే తెలంగాణ): వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు రెండోరోజు మంగళవారం నామినేషన్లు రాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠీ ఒక ప్రకటనలో తెలిపారు. తొలి రోజు ఒక నామినేషన్ మాత్రమే దాఖలైన విషయం తెలిసిందే. కాగా, 5, 6, 7, 10వ తేదీల్లో మాత్రమే నామినేషన్ల దాఖలకు అవకాశం ఉంది. ఇప్పటికే దాదాపు ప్రధాన ఉపాధ్యాయ సంఘాలకు చెందిన అభ్యర్థులంతా ఖరారయ్యారు. ఈ నెల 7న టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థిగా ప్రస్తుత ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి నామినేషన్ దాఖలు చేయనున్నట్లు ఆ సంఘం నేతలు తెలిపారు. 10న పీఆర్‌టీయూ అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డి నామినేషన్ వేయనున్నట్లు ఆ సంఘం నేతలు వెల్లడించారు. 6,7,10 తేదీల్లో ప్రధాన సంఘాల అభ్యర్థులంతా నామినేషన్లు దాఖలు చేసేందుకు సన్నద్ధం అవుతున్నట్లు సమాచారం. నామినేషన్ల దాఖలు సందర్భంగా భారీ ర్యాలీలు, మీటింగ్‌లు నిర్వహించేందుకు కూడా అనుమతి కోసం అధికారులకు లేఖలు అందజేసినట్లు తెలిసింది.

# స్థానిక పోరుకు సంసిద్ధం





## ఇటు అధికార యంత్రాంగం.. అటు రాజకీయ పార్టీల ఏర్పాట్లు

- ఇప్పటికే బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్ పూర్తి
- వార్డుల వారీగా ఓటరు జాబితా తయారు
- ఎన్నికల నిర్వహణకు శిక్షణ తరగతులు
- ఆర్వో, ఏఆర్వోల జాబితా ఫైనల్
- గ్రామాల్లో ఎన్నికల తరహా హడావుడి
- పోటీకి సిద్ధమవుతున్న ఆశావహులు
- స్థానాల రిజర్వేషన్లపైనే అందరి దృష్టి

**స్థానిక సంస్థల ఎన్నికలకు అంతా సిద్ధమవుతున్నది. అధికార యంత్రాంగం.. రాజకీయ పార్టీలు వారి పనుల్లో బిజీ అయ్యాయి. జిల్లాలో బ్యాలెట్ పేపర్ల ముద్రణ ఇప్పటికే పూర్తయింది. వార్డుల వారీగా ఓటరు జాబితా తయారు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో ఎన్నికల తరహా హడావిడి మొదలైంది. బరిలోకి దిగేందుకు వివిధ పార్టీ నుంచి ఆశావహులు సిద్ధమవుతున్నారు. మరోవైపు స్థానాల రిజర్వేషన్‌పై ఉత్కంఠ నెలకొంది.**

– యాదాద్రి భువనగిరి, జనవరి 4 (నమస్తే తెలంగాణ)

యాదాద్రి భువనగిరి జిల్లాలో గతంలో 421 పంచాయతీలు ఉండగా, కొత్తగా ఏడు పంచాయతీలను ఏర్పాటు చేయడంతో వాటి సంఖ్య 428కి చేరింది. మొత్తం 5,20,441 మంది ఓటర్లు ఉన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం గతేడాది ఫిబ్రవరి ఒకటిన ముగియగా, ప్రస్తుతం ప్రత్యేక అధికార పాలన కొనసాగుతున్నది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికార యంత్రాంగం పనుల్లో నిమగ్నమైంది.

### ప్రధాన పార్టీల ఏర్పాట్లు..

గ్రామాల్లో ఆశావహులు ప్రజలను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. వివిధ ప్రాంతాలకు తీసుకెళ్తూ దావత్ ఇస్తూ మచ్చిక చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. పండుగలకు పెద్దఎత్తున ఖర్చు పెడుతున్నారు. డబ్బులకు వెనకాడకుండా లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలు పార్టీల రహితంగా జరుగనుండడంతో పోటీ పడేవారి సంఖ్య అధికంగానే ఉండనుంది. ప్రజల్లో గుర్తింపు పొందేందుకు వారి వారి ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయా పార్టీల మద్దతు కోసం ప్లాన్ చేసుకుంటున్నారు. మరో వైపు ఎన్నికల కోసం ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, వామపక్షాలు రెడీ అవుతున్నాయి. ఎన్నికల్లో తమ మద్దతు ఉన్నవారినే గెలిపించి సత్తా చాటేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి.

### చకచకా ముందస్తు ఏర్పాట్లు..


ఎన్నికలకు ముందస్తు ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. ఎన్నికల నిర్వహణకు ఆర్వో, ఏఆర్వో జాబితా ఫైనల్ అయింది. గ్రామాల్లో ఓటరు జాబితా ప్రక్రియ తుది దశకు చేరుకున్నది. వార్డుల వారీగా జాబితాను రూపొందిస్తున్నారు. తాజాగా ఎన్నికల నిర్వహణ కోసం శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మంగళవారం పలువురు అధికారులు హైదరాబాద్‌లో శిక్షణ తరగతులకు హాజరయ్యారు. బుధవారం మరో బ్యాచ్ వెళ్లనుంది. వారి శిక్షణ అనంతరం.. జిల్లాలో ఇతర అధికారులు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు.

### బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్ పూర్తి..

జిల్లాలో బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్ ప్రక్రియ పూర్తయింది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం సర్పంచ్ అభ్యర్థులకు 30 రకాలు, వార్డు సభ్యుల అభ్యర్థులకు 20 రకాల గుర్తులను కేటాయించారు. సర్పంచులకు సంబంధించి గులాబీ కలర్ బ్యాలెట్ పేపర్, వార్డు సభ్యులకు తెల్ల రంగు బ్యాలెట్ పేపర్లు సిద్ధం చేశారు. సర్పంచులుగా పోటీ చేసే వారికి ఉంగరం, కత్తెర, ఫుట్‌బాల్, బ్యాట్, బ్యాట్స్మెన్, స్టంప్స్, టీవీ రిమోట్, టూత్ పేస్ట్ వంటి 30 రకాల గుర్తులను కేటాయించారు. వార్డు సభ్యులకు పొయ్యి, స్టూల్, బీరువా, గ్యాస్ సిలిండర్, గౌన్, ఈల, కుండ వంటి 20 గుర్తులను సిద్ధం చేశారు.

### రిజర్వేషన్‌పై టెన్షన్ టెన్షన్

స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. బీసీ రిజర్వేషన్లు తేల్చాకే ఎన్నికలకు వెళ్తామని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. తాజాగా బీసీ కుల గణన నివేదికను వెల్లడించింది. దీని ఆధారంగా రిజర్వేషన్లు ఖరారయ్యే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏ గ్రామ సర్పంచ్ పదవికి ఏ రిజర్వేషన్ వర్తిస్తుందో, ఏ వార్డు ఎవరికి కేటాయిస్తారోనని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న పెర్కకొండారం గ్రామస్తులు

## కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరికలు

శాలిగౌరారం, ఫిబ్రవరి 4 : మండల పరిధిలోని పెర్కకొండారం గ్రామ కాంగ్రెస్ పార్టీకి చెందిన నాలుగు కుటుంబాలు మంగళవారం తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరాయి. ఈ సందర్భంగా వారికి కిశోర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విరక్తి చెందిన ప్రజలు ప్రజా సంక్షేమం కోసం పాటుపడిన బీఆర్ఎస్ వైపు ఆకర్శితులై పార్టీలో చేరుతున్నారని అన్నారు. ఎన్నికల హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ సర్కారు పూర్తిగా విఫలమైందని తెలిపారు. రైతు భరోసాపై మాటమార్చి రైతులను ముంచిందన్నారు.

కార్యక్రమంలో కట్టా వెంకట్‌రెడ్డి, దుబ్బ వెంకన్న, నూక జానయ్య, యామగాని వెంకన్న, దేవరకొండ సైదులు ఉన్నారు.

## మాజీ సర్పంచ్‌ల అరెస్టు



తిరుమలగిరిలో మాజీ సర్పంచ్‌లను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

- చలో అసెంబ్లీకి వెళ్లకుండా అడ్డగింపు
- ఎక్కడికక్కడ నిర్బంధం
- అక్రమ అరెస్టులంటూ మాజీ సర్పంచ్‌ల మండిపాటు

నల్లగొండ ప్రతినిధి, ఫిబ్రవరి4(నమస్తే తెలంగాణ) : కుల గణన, ఎస్సీ వర్గీకరణపై ప్రత్యేకంగా మంగళవారం అసెంబ్లీ సమావేశం నిర్వహిస్తున్న నేపథ్యంలో ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా పోలీసులు అరెస్టుల పర్వం సాగించారు. మాజీ సర్పంచ్‌లపై ప్రత్యేకంగా దృష్టి సారించి అందరినీ ఎక్కడికక్కడ ముందస్తు అరెస్టు చేశారు. తెల్లవారుజాము నుంచే గ్రామాల వారీగా గుర్తించి అదుపులోకి తీసుకుని ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. సాయంత్రం వరకు అక్కడే నిర్బంధించారు. గతేడాది జనవరిలో సర్పంచ్‌ల పదవి కాలం ముగియగా, పాలనా సమయంలో అనేక మంది అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. వాటికి సంబంధించిన బిల్లుల పెండింగ్‌లో ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మాజీ సర్పంచ్‌లు గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపులపై తీవ్ర జాప్యం చేస్తున్నది.

ప్రభుత్వం నుంచి చలనం లేకపోవడంతో దఫదఫాలుగా ఆందోళనకు దిగారు. గత అసెంబ్లీ సమావేశాల సమయంలో సైతం చలో అసెంబ్లీకి పిలుపునివ్వగా ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి అరెస్టులు చేయించింది. ఆ తర్వాత ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటనల సమయంలోనూ ముందస్తు అరెస్టులు చేశారు. తాజాగా మంగళవారం అసెంబ్లీ సమావేశం నేపథ్యంలో మాజీ సర్పంచ్‌లు చలో అసెంబ్లీకి వెళ్తారని భావించి పోలీసులు రంగంలోకి దిగారు. ఎక్కడికక్కడ మండలాల వారీగా అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు.

# తుంగతుర్తి కాంగ్రెస్‌లో గ్రూపుల కుంపటి



మోత్కూరులో ఎమ్మెల్యే సామేల్‌కు వ్యతిరేకంగా సోమవారం నిర్వహించిన సమావేశానికి హాజరైన అసమ్మతి కాంగ్రెస్ శ్రేణులు

**తుంగతుర్తి నియోజకవర్గ కాంగ్రెస్‌లో గ్రూపుల కుంపటి రగులుతున్నది. ఎమ్మెల్యే మందుల సామేల్ వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న సొంత పార్టీ నేతలే తిరుగుబావుటా ఎగురవేశారు. ముందే ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్న ఆ పార్టీ నేతలు.. నియోజకవర్గంలో ఎమ్మెల్యే కుమారులు, అల్లుడు ఇసుక వ్యాపారం, కాంట్రాక్టులు, వైన్ షాపుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని బహిరంగంగా ఆరోపిస్తున్నారు. ఐదారు నెలల నుంచి ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా ప్రెస్‌మీట్లు, సభలు, నిరసనలు తరుచూ చేపడుతున్నారు. తాజాగా మోత్కూరులో వేలాది మంది కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో జరిగిన భారీ అసమ్మతి సభ తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని తొమ్మిది మండలు ఉండగా.. ఎమ్మెల్యే సామేల్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి అనుచరులు మూడు వర్గాలు గ్రూపు రాజకీయాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే తిరుమలగిరి మార్కెట్ చైర్మన్ ఎంపిక ఆగిపోయింది.**

– సూర్యాపేట, ఫిబ్రవరి 4 (నమస్తే తెలంగాణ)

- మూడు వర్గాలుగా విడిపోయిన నేతలు
- ఎమ్మెల్యేకు నిరంతర నిరసన సెగలు
- తాజాగా మోత్కూరులో భారీ అసమ్మతి మీటింగ్

తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌పై ఆ పార్టీ నేతలు కొందరు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పదేండ్లపాటు అధికారానికి దూరంగా ఉన్నామనే ఆలోచనతో అంతా ఏకతాటిపై నిలబడి కాంగ్రెస్ పార్టీ నుంచి సామేల్‌ను గెలిపించుకుంటే ఇప్పుడు పార్టీ శ్రేణులను పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. కేవలం ఆయన కుటుంబ సంక్షేమం కోసమే పని చేస్తున్నారని మోత్కూరు కేంద్రంగా జరిగిన సభలో ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం బాహాటంగా ఆరోపణలు చేసింది. తాము కష్టపడి కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిపించుకుంటే ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ పార్టీని బొంద పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని తొమ్మిది మండలాలు సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రిభువనగిరి జిల్లాల్లో విస్తరించి ఉన్నాయి. కాగా, ఎమ్మెల్యే సామేల్, మంత్రి కోమటిరెడ్డి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి గ్రూపులుగా కాంగ్రెస్ పార్టీ విడిపోయి ఉంది. ప్రధానంగా ఎమ్మెల్యేపై నిరంతరం అసంతృప్తి జ్వాలలు చెలరేగుతున్నాయి. తట్టెడు ఇసుక కూడా ఎత్తనివ్వనని ఎన్నికల ముందు ఊరూరా తిరిగి ప్రచారం చేసి సామేలు ప్రస్తుతం ఆయన కుమారులతో దందా నడిపిస్తున్నారని కాంగ్రెస్ నాయకులే విమర్శిస్తున్నారు. తుంగతుర్తిలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేనే ఉన్నప్పటికీ అంతకు ముందు మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి తన కుమారుడు సర్వోత్తమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ ఏర్పాటు చేసి ప్రజా సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించారు. శాలిగౌరారం మండలానికి చెందిన నాగరాజు అనే వ్యక్తి ఎమ్మెల్యే పోలీసులకు చెప్పి తనను చితక బాదించారని ఆరోపిస్తూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం కూడా అప్పట్లో కలకలం రేపింది. అర్వపల్లిలో కాంగ్రెస్ సీనియర్ నేత యోగానందచార్యులు నేతృత్వంలో ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా సమావేశానికి సిద్ధమవగా, రాత్రికి రాత్రి సొంత పార్టీ నాయకులను ముందస్తు అరెస్టులు చేయించడం వర్గపోరు ఏ స్థాయిలో ఉందో తేటతెల్లం చేసింది.

### మోత్కూరు సభతో తారాస్థాయికి అసమ్మతి

మోత్కూరులో ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం వేలాది మందితో నిర్వహించిన సభతో కాంగ్రెస్‌లో కుమ్ములాటలు తారాస్థాయికి చేరుకున్నాయని చెప్పవచ్చు. ఈ మీటింగ్ ఎమ్మెల్యే వర్గం దిక్కుతోచని స్థితిలో పడిందని ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. ఇప్పటి వరకు రాజకీయం ప్రాబల్యం కోసం పదవుల పందేరంలో ఒక్కోసారి ఒక్కో ఇద్దరు కలుస్తూ కడుపులో కత్తులు పెట్టుకొని పైకి కౌగిలించుకుంటున్నట్లు నియోజకవర్గంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. శాలిగౌరారం, మోత్కూరు, తుంగతుర్తి మూడు మార్కెట్ కమిటీల విషయంలో శాలిగౌరారం మార్కెట్ కమిటీని ఎమ్మెల్యే ప్రతిపాదించగా, మంత్రి కోమటి రెడ్డి అనుకూలంగా ఉండడంతో మోత్కూరు మార్కెట్ చైర్మన్ పదవి కోమటి రెడ్డి వర్గానికి దక్కింది. తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ మంత్రి కోమటిరెడ్డి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి ఇద్దరికీ అనుచరుడుగా ఉండగా వారు ప్రతిపాదించిన వ్యక్తికే ఎమ్మెల్యే అంగీకరించాల్సి వచ్చిందని కాంగ్రెస్ వర్గాలు వ్యక్తం చెప్తున్నాయి. నియోజకవర్గ రాజకీయాలకు కేంద్ర బిందువు అయిన తిరుమలగిరి మార్కెట్ చైర్మన్ గిరికి మాత్రం ప్రతిష్టంభన నెలకొంది. ఇక్కడ ఒకరిని ఎమ్మెల్యే సామేల్ ప్రతిపాదిస్తుండగా మరొకరిని మంత్రి కోమటిరెడ్డి, మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి కలిసి చూపించడంతో పెండింగ్‌లో పడింది. పరిస్థితి ఇలాగే ఉంటే నియోజకవర్గంలో కాంగ్రెస్ పతనం తప్పదని ఆ పార్టీ నేతలే చెప్పుకొంటున్నారు.





కరెంట్ సరఫరా నిలిపివేయడంతో టిప్పర్లను అడ్డుకొని నిరసన తెలుపుతున్న నర్సిరెడ్డిగూడెం గ్రామస్తులు

## ముంపు గ్రామంపై దౌర్జన్యం

- స్తంభాలు కూల్చి నర్సిరెడ్డిగూడేనికి రాత్రిపూట కరెంట్ సరఫరా నిలిపివేత
- పునరావాసం కల్పించకుండా పంపించే ప్రయత్నం

మర్రిగూడ, ఫిబ్రవరి 33 : శివన్నగూడెం ప్రాజెక్టు ముంపు గ్రామమైన నర్సిరెడ్డిగూడెం పట్ల అధికారులు దౌర్జన్యం ప్రదర్శించారు. నిర్వాసితుల విషయంలో మానవీయ కోణంలో వ్యవహరించాల్సింది పోయి రాత్రి పూట స్తంభాలను కూల్చేసి కరెంట్ సరఫరాను నిలిపివేశారు. దాంతో మంగళవారం రాత్రి గ్రామమంతా అంధకారం అలుముకుంది. ప్రజలు భయాందోళనలతో బిక్కుబిక్కుమన్నారు. కరెంట్ సరఫరా తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు టిప్పర్‌లను నిలుపుదల చేసి ప్రాజెక్టు పనులను అడ్డుకున్నారు. ఇరిగేషన్, ట్రాన్స్‌కో అధికారులు ప్రాజెక్టు కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై కావాలనే రాత్రి సమయంలో కరెంటు బంద్ చేయించారని వారు ఆరోపించారు. ప్రాజెక్టు క్యాంపు కార్యాలయంలో కరెంటు ఉందని, గ్రామానికి వచ్చే 6 స్తంభాలను కూల్చేసి విద్యుత్‌ను నిలిపివేశారని మండిపడ్డారు. గ్రామంలోని 289 మంది ముంపు బాధితులకు గానూ 257 మందికి చింతపల్లి మండలంలో ప్లాట్లను కేటాయించారని, ఇంకా 32మందికి ప్లాట్లను ఇవ్వాల్సి ఉందని తెలిపారు. వారికి కూడా పూర్తి స్థాయిలో ప్లాట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. పునరావాసం కల్పించకుండానే నిర్వాసితులను భయభ్రాంతులకు గురిచేసి ఎలాగైనా ఈ నెల 6వరకు గ్రామాన్ని ఖాళీ చేయించాలని అధికారులు కుట్ర చేస్తున్నారని అన్నారు.